

# యామినీ సరస్వతి

అది చాలా ఏళ్లుగా పాడుబడివున్న కొంప

అందులో దాదాపు ఏడెనిమిది 'బిచ్చగాళ్ళ' కుటుంబాలు నివసిస్తున్నాయ్. ఏళ్ళ తరబడిగా అందులో నివసిస్తున్నారు కొందరు - కొందరు తరతరాలుగా వుంటున్నారు దినమూ భుక్తికి లోటు లేకుండా, ఒక్కొక్కసారి ఎక్కువగా కూడా సంపాదిస్తూవుంటారు వాళ్లు

కెవ్వుమని కేకవేసి భూమ్మీదపడ్డ పసికందు మొదలుకొని మరణశయ్యపై నుండి పాడెపైకి పయనించే వృద్ధు వరకూ వాళ్ళఖర్చు వాళ్ళు సంపాదించుకోగలరు. అయినా వాళ్లు కూడబెట్టుకోలేరు. కూడు-బట్ట తప్ప కోరుకోలేరు

అందరూ గుంపుగా కూర్చున్నారు, ఆ రోజు

అందరి మధ్యా ఠీవిగా కూర్చున్నాడు నలభై యేళ్ళ వ్యక్తి। అతని పేరు — ఆప్యాయంగా తలిదండ్రులు పెట్టుకున్నది సుందరం. కానీ కాలం కలిసి రాక యిప్పుడా పేరు 'కుంటాడు'గా మారింది మరికొందరు 'మహోప్పేడా' అనీ అంటారు

బాల్యంలో బంగారు బాబులా వుండే వాడు సుందరం తండ్రి బిచ్చమెత్తుకుని సంపాదించి తన కొడుకుని చదివించాలని బడికి పంపేడు. సుందరం తొమ్మిది వరకూ చదివాడు అప్పుడే ఓ రోజు బడినుంచి వస్తూవుండగా యాక్సిడెంటై కాలు విరిగిపోయింది.

మూడు నెలలు ఆస్పత్రిలో వుండి కుంటుతూ నడిచేట్టుగా తయారయ్యాడు. మృత్యుముఖం నుంచి బయటపడ్డాడు అనుకునే సమయంలో పెద్ద అమ్మవారు వాడి ముఖాన్ని వికృతంగా మార్చి కళ్ళల్లో పూలు పూయించి వెళ్ళిపోయింది. దాంతో వాను చదువుకి స్వస్తిచెప్పాల్సి వచ్చింది.

చుట్టూ కూర్చున్న వాళ్ళతో గర్వంగా చెప్పుతున్నాడు కుంటోడు.

"ఒరేయ్! మా వంశం సంగతి మీకు తెలీదురా! మాది రాజా వంశం! మా తాత చెయి చాచి బిచ్చమడుక్కోలేదు. జంగం సుద్దులు, పల్నాటి పాట, అధ్యాత్మ రామాయణ కీర్తన్లూ పాడేవాడు. మా తాత గొంతువిప్పి పాడటం మొదలుపెడితే బడికివెళ్ళే పిల్లలు మొదలుకొని పనికి వెళ్ళే పెద్దల వరకూ ఆగి విని చేయివిదిల్చి వెళ్ళేవారు రోజూ ఓ సెంటర్లో కూచుని తంబూరా శృతి చేసుకుంటూ పాడుతూ వుంటే గంధర్వులా చెవి వొగ్గి వినేవారు"

"నువ్వు మాత్రం తక్కువేటి? గొంతిప్పితే కోటి సొరాలు పలుకుతాయ్. అయాల నువ్వెల్లిన యీది కెల్తే మా నోట్లో దుమ్మే" అన్నాడు గుడ్డోడు. వాడు కూడా పాటగాడే.

"నువ్వుండనేం అణ్ని సెప్పనియ్యి!" విసుక్కుంది నూకాలు. నూకాలు కూడా కాలు లేదు. పైగా కుష్ఠురోగి. దానికి సుందరం ఆరాధ్య పురుషుడు. ఒక్కసారైనా వాడి భార్యగా వాడితో గడపాలని దాని యావ

అది 'వసంత ఋతువు' వంటిపై కొచ్చిన రోజుల్లో పెద్ద పెద్ద మారాజుల కౌగిళ్ళలో ఒదిగిపోయిందే! పనిపాటలు నేర్చుకుని ఎవరింట్లోకి వెళ్ళినా దాన్ని చూసి మోజుపడేవారు అయ్యగారి యిష్టం యింటి ఇల్లాలికి తెలిసిపోయేది. అది మళ్ళీ మరో యిల్లు వెతుక్కునేది. చివరికి అకాల గ్రీష్మం శరీరాన్ని 'తినేసింది'. కుష్ఠు వచ్చేసింది. రాయల్ ప్రొఫెషన్‌కి దాఖలైంది అది!

దానికి సుందరమంటే వల్లమాలిన ఆరాధన.

కానీ వాడు దాన్ని కన్నెత్తి చూళ్ళేదు. చేయెత్తి తాకలేదు.

అందుకే అది తన ఆరాధనని గుండెల్లో గుడికట్టి భద్రంగా దాచుకుంది.

నవ్వేడు సుందరం దాని మాటలకి

"ఇక మా నాన్న విషయం చెపితే ఆశ్చర్యపోతారు. అయన అందగాడు. పాటగాడు. మా తాతగారి నుంచి వచ్చిన

కంఠ మాధుర్యంతో గొంతెత్తి పాడే వాడు. బళ్లకి, కాలేజీలకి వెళ్ళి పాడే వాడు. ఎంకి పాటలు, కిన్నెరసాని పాటలు, శివతాండవం, లచ్చి పాటలు బహు గొప్పగా పాడేవాడు

"ఆయన గొంతులో ఆ భావగీతాలు, ఆ మధుర గీతాలు జీవం పోసుకునేవి. ఎక్కడికి వెళ్ళినా చందాపట్టి పాతిక్కి తగ్గేదికాదు. మా నాయన్ని చూసి మా అమ్మ వలచింది. ఆమె బుద్ధి వెంగళ రెడ్డిమీద పాటలు పాడేది. భద్రాచల రామదాసు కీర్తనలు పాడేది. తిరణాలకు వెళ్ళి యిద్దరూ కూర్చుని పాడటం మొదలుపెడితే ముందు పరిచిన జోలె కనకవర్షం కురిసేది"

ఆగాడు కుంటోడు.

మళ్ళీ "మా అమ్మ ఎట్లాపోయిందో మీకు తెలుసు -అందం చూసి ఆశపడ్డ తామందు మా అమ్మను చంపేశాడు. మా నాన్న కళ్ళుపోయాయి కొట్లాటలో!" అన్నాడు. అతని కంఠం రుద్ధమైంది.

"మా వంశానికి కళ్లు అచ్చిరాలేదు.

"అసలు అడుక్కునేవాళ్ళకి కళ్ళుండ కూడదు కాళ్ళుండ కూడదు. ఈ రెండూ యోగ్యతా పత్రాలు. ఎక్కడికి వెళ్ళినా డబ్బులే డబ్బులు. ఒకోక్క తల్లి తిండిపెట్టి బట్ట యిస్తుంది.

"కళ్లుంటే నాటకాలు చూద్దాం అని పిస్తుంది.... అందుకే అవి ఉండకూడదు మనకు. మనం మనో నేత్రంతో జగన్నాధుని చూడాలి!

"కదూ తాతా?"

ఎవరూ జవాబివ్వలేదు. అడిగిన తాత మాత్రం బీడిదమ్ము పీల్చి 'అవున్నా' అన్నాడు. వాడు పుట్టుగుడ్డి.

ఓ మూలగా కూచున్న సింగారి మాత్రం తెగ ఏడుస్తోంది. అయితే దాని ఏడుపుని ఎవరూ గమనించటం లేదు.

"ఇప్పుడు నాబిడ్డకి పెళ్ళి చెయ్యాల! దానికి కన్నొంకర, కాలొంకర, ముక్కొంకర, మూతొంకర - లేవు. పోతపోసిన విగ్రహంలా వుంది. అయితే అది మూగది - మూగదంటే మూగది కాదు. మాటలు వస్తాయి కానీ మాటా ళ్ళేదు అది సినిమా హాలు గేటుకీపర్ని లవ్ చేసింది.

"అందులో దాన్తప్పులేదు. నాతప్పు లేదు.

"తప్పల్లా ఆ గేటుకీపరు గాడిది. తి గురంగా మని వుంటాడు వాడు."

"టికెట్లు చించకుండా అమ్ముకుని కొంత డబ్బు తీసుకుని వదలి కొంత రోజూ సంపాదిస్తాడు. వచ్చే జీతం అరవ్వయ్యే అయినా అరొందల జీత గాడిలా వుంటాడు

జీతం ఎంతొస్తేనేం వాడి జీవితం పరాధీనమే.

మనలాగా దర్జాగా బతుకుతాడా?

మనం స్వేచ్ఛా జీవులం! అదన్నట్టు

ప్రేబర్ట్స్‌మి! 'విద్య'తో బ్రతికేస్తున్నా! వాళ్ళకి మనకు సాపత్యమా? కయ్యానికి వియ్యానికి సమానపాయా వుండాల!

"అందుకే నేను నా బిడ్డను కుంటో డికో, గుడ్డోడికో యిస్తాను. అది పుట్టిన నాడే నిశ్చయించుకున్నానట్లా అవి!

"వెతగ్గా వెతగ్గా నాకు గుడ్డోడేకని పించాడు. వాడి కళ్లు గుడ్డివి....కానీ వాడి గొంతు గుడ్డిది కాదు మా తాత పాటగాడు. మా నాయన పాటగాడు నేనూ ఎంతా యింతో పాడుతాను. ఘంటసాల పాటలు నేను పాడితే యింటున్నోళ్లు చెవులు వొగ్గేస్తారు. నాకు కొడుకులు లేరు. ఉన్న ముగ్గురూ ఆడ బిడ్డలే!

"ఎమర్జన్సీలో నాకూ, నా ఇంటిదానికీ యిద్దరికీ ఫామిలీ ప్లానింగ్ ఆపరెషన్ చేసినారు. ఎంత ఆలోచించినా మాకు మగపిల్లలు పుట్టే మార్గం లేదు. నా చిన్న బిడ్డలిద్దరూ తంచుదానం చేసుకుని కమ్మని కంఠంతో పుట్టారు.

ఈ సింగారికే గొంతులేదు. అందుకే దాన్ని మూగది అన్నాను. అందుకే దీని మొగుని కయినా గొంతుండాలని ఆశ పడ్డాను!"

అందరూ బీడీలు తాగుతూ, ఆకు నములుతూ వింటున్నారు. సింగారి మాత్రం కుళ్లి కుళ్లి ఏడుస్తోంది.

మూకాలు గొంతు విప్పింది. అది కుష్ఠుతో అసహ్యంగా వుంటుంది. కానీ గొంతులో గంధర్వులు నాట్యం చేస్తారు. కోయిలలు కూస్తాయి. వీణలు మోగుతాయి.

'బావా! నా మాటినుకో! ఆ గుడ్డోడు బాగానే పాడ్తాడు మనిషీ బాగుంటాడు కానీ అడు జబ్బు మనిసి. అడోళ్ళ జబ్బున్నమనిషి. ఆడి నాయనకి రోగం... అది .అది బొల్లి. అది వాడికీ వుంటుందనే నా అనుమానం. పైగా అడు అడు నా తోడుగా కాన్నా ల్లుండిన్నాడు నాతో తొంగున్నాడు "

"ధూ "

కాండ్రించి వుమ్మేడు కుంటోడు.

"నోర్మూయ్యే తిక్క ముండా! సెప్పినా నేనమ్మను దానికి వాడికి లగ్నం పెట్టించేస్తాను.

ఎందుకంటే... ..

వాడు జబ్బుమనిషయితే మరీ మేలు. డబుల్ బెనిఫిట్. డబ్బులు బాగా రాల్తాయ్. అత్తెలుసుకో...మనిషి దేందే? ఎట్లుంటేనేం? డబ్బు సంపాయి చాల. అదీ ముఖ్యం "

ఇక వాదనకి తావు లేదన్నట్టుగా వెళ్లిపోయాడు కుంటుకుంటూ.

* * *

"ముద్దబంతి పూవులో
మూగమనసు బాసలో. "

కమ్మగా పాడుకుంటున్నాడు సుందరం

పాటయ్యాక "నాయనా!" అంటూ పిలిచింది సింగారి.

"ఏమ్మా!"

"నేను బతికుండాలంటే నాకీ పెళ్ళొద్దు. నన్ను చిన్నాకిచ్చి చెయ్!"

సుందరం కళ్ళల్లో కోపం తారట్లాడింది

"పాపా!" అన్నాడు సాధ్యమైనంత మృదువుగా "నీకు లోకం తెలియదు. వాడివద్దేముంది? రిక్షాటాకు తప్పితే! గుడ్డోడిదగ్గ రెంతుందో నీకు తెలుసా? వెయ్యి రూపాయలు అఁ ఏమను కున్నావ్? దాంతో నీ యిష్టం అదంతా నీ ఒలి క్రిందిస్తాడు చూస్కో..."

"అయినా నా కొద్దు!"

"ప్చ్ లాభం లేదు! నువ్వు గింజు కున్నా, మొండికెత్తినా యిది ఆగదు. బావిలో దూకి చస్తానన్నా లాభం లేదు నీ పీనుగ కయినా పెళ్ళి చేస్తాను!"

సింగారి ఏడ్చేసింది గట్టిగా ఏనాడూ కసురుకోని తండ్రి అలా అనేసరికి.

అంతలో సింగారి తల్లి వచ్చింది.

"మీ అమ్మను చూసినావా? దాన్ని దాని అందాన్ని చూసి రెడ్లంతా గుటక లేస్తారు పెళ్లాన్ని కావని గంపలకి గంపలు గింజలు పెడతారు వాళ్లు. కొంచెం చాటు అయితే చాలు చెయ్యి పట్టుకోబోతారు. ఇప్పటికీ మీ అమ్మ అందంగానే వుంది. అది వయస్సులో కన్నా, కాలూ చక్కగావున్న రోజుల్లో అది గజ్జలగుర్రంలాగా వుండేది. నాకిచ్చి చేశాడు మీ తాత.

"రెండేళ్లు స్వర్గంలో వున్నాం. అయినా స్వర్గం కూడుపెట్టదని తెలుసు. అందుకని ఓ రోజు మీ అమ్మ కాళ్లు విరిచేశా! ఓ కంటిలో జిల్లేడు పాలు పోశా! అ కన్ను పోయింది. కాలు విరిగింది. అంతే రోజురోజుకీ దాని ఆదాయం పెరిగింది.

"ఈ లోకంలో అన్ని అవయవాలూ బాగుంటే బిచ్చం పెట్టరు. ఎంత దీనంగా వుంటే అంతగా దానం చేస్తారు. అన్నీ బాగుంటే కూలి చేసుకో అంటారు

"పైగా మీ అమ్మే అన్నీ చక్కగా వుంటే బిచ్చమెత్తుకునేది కాదు. నన్ను కాదని బతికేది.

"నన్ను కాదంటే ఒళ్ళమ్ముకుని బతకాల్సిందే! ధూఁ అదీ ఒక బ్రతుకేనా? దానికంటే చావడం మేలు!"

"సింగారీ!" గాత్తుర్గా పిలిచింది అలమేలు

"అమ్మా!"

"మీ నాయన మాటినవే! బాగుపడతావు!"

'నువ్వూ అదేమాట అంటున్నావా అమ్మా?'

కూతురి ప్రశ్న గుండెల్లోకి దిగింది. 'యూ టూ బ్రూటస్,' అన్నట్టుగా వుందా ప్రశ్న! అలమేలు నోరెత్తలేదు.

"సింగారీ! నా మాట వేదమే మీ అమ్మకు. నా మాటమీదే కన్నూ, కాలూ పోగొట్టుకుంది!" అన్నాడు సుందరం.

సింగారి బదులు చెప్పలేదు.

తండ్రి 'జీవనవేదా'నికి అడ్డుచెప్ప లేక ఆలోచనల్లో మునిగిపోయింది

* * *

గుడ్డోడిచ్చిన ఒలితో తనకూ, భార్యకూ, బిడ్డలకూ, సింగారికి మంచి గుడ్డలు కొన్నాడు. సెకండ్‌హేండ్ సెంటర్లో .... తాళిబొట్టు కొన్నాడు. మెట్టెలు, వెండి మువ్వలు చేయించాడు. వేలికి వెండి ఉంగరం కొన్నాడు.

పెళ్ళి బ్రహ్మాండంగా సత్యనారాయణ స్వామి సన్నిధిలో జరిగిపోయింది. పూర్వాశ్రమంలో దర్జాగా బ్రతికిన రోజుల్లో పౌరోహిత్యం చేసి, జరక్క యాయావారం చేసుకుంటూ బతుకు తున్న తొంభయ్యేళ్ళ వృద్ధ పరశు రామయ్య పెళ్ళి చేయించాడు. అలాగా ఆ పెళ్ళికి 'రాముడి' ఆమోదముద్ర కూడా వచ్చిందన్నాడు పిచ్చోడు.

అయిదు రూపాయల దక్షిణిచ్చి, రెండుపళ్ళ బియ్యమిచ్చి, జనతా పంచల చాపూ, కండవా యిచ్చాడు సుందరం.

ధనకనక వస్తువాహనాలిచ్చినంతగా పంబరపడిపోయి "శతమాయుష్యం...." అని దీవించారాయన.

ఆ రాత్రి ఆ విరిగిపోయిన కూలిపోటో తున్న మేడలో గోడలు మాత్రం వున్న ఓ ఆఖరి గది శుభ్రం చేసి 'పడకలు' ఏర్పాటు చేశారిద్దరికీ కొత్త చాపా, బొంతా, దిండూ, దుప్పటీ, మట్టి కూజా, సిల్వర్ గ్లాసు, మిఠాయిబండిలో కొన్న లడ్డు, జిలేబి, బాదుషా, కారబ్బూందీ అన్నీ దర్జాగా చక్కగా అమర్చింది అలమేలు.

శుభ్రంగా అన్నీ తినేశాడు గుడ్డోడు. దృతరాష్ట్రుడిలా అనుభంవున్న ఆనం దాన్ని కొత్త శరీరంతో మళ్ళీ గుర్తు చేసుకోవాలని ఆరాటంతో 'సింగారీ!' అని పిలివాడు అది పలక్కపోతే, పక్క తడిమేడు దానికోసం.

అది దూరంగా జరిగి అంది. "ఒరే గుడ్డోడా? నన్నంటుకోవద్దు. దూరంగా వుండు. ఇప్పుడు తొలాట అయిపోయి రెండో ఆట యింటర్వెల్ యిడిచినారు. ఇంకాస్సేపటికి నాగేస్సర్రావులా వస్తాడు నా చిన్నా! నేను వాడి 'సొత్తును, నీ పెళ్లాన్ని! అంతే! నువ్వు నోర్మూసుకుని పడివుంటే ఎప్పటికయినా నీ పెళ్లా న్నయితా! లేదంటే యిప్పుడే బావిలో దూకుతా! నువ్వు కేకలువేసి నన్నాపినా నాతో తొంగోలేవు. తర్వాత నేను యిప్పుడు కాకపోయినా ఎప్పుడయినా వాడితోనే లేచిపోతా! అట్లా కాకుండా నే చెప్పినట్టు నువ్వు నోర్మూసుకున్నావా ఈ తొలిరాత్రి మాకు హాయిగా గడిచి పోతుంది. తర్వాత ఎప్పటికయినా నేను నీ పెళ్లాన్నే!"



గుడ్డోడు నోరెళ్ళబెట్టేడు. వాడికి సింగారి నీతి అర్థమైంది. "నీ యిష్టమే యిష్టం! అదంతే! నీ యిష్టమే నా యిష్టం, మనసులేని మనువు గతి యింతే! కానీ.. నీ యిష్టం .. నీ యిష్టం ... ఎప్పటి కయినా .... అంతే! అంతే!" అన్నాడు గద్గదికంగా.

సింగారి వాడిని పట్టించుకోలేదు.

* * *

రెండేళ్ళు ధాటేయో, మూడేళ్ళు దాటేయో సింగారి లెక్కించుకోలేదు ఆ తర్వాత! గుడ్డోడూ అంతే! అదీ వాడూ వేరే వొండుకొంటున్నారు తలిదండ్రుల దగ్గరే! గుడ్డోడి సంపాదన రోజూ హీనంగా అయిదు రూపాయలుంటుంది. వాడ్ని స్టేషన్లో తూర్పు బండెక్కించి, సాయంకాలం పడమటి బండ్లో దించుకుంటుంది. ఆ పగలంతా అది సత్రం లోనో, సినిమా హాల్లోనో గడిపేస్తుంది! ఏమీ అనటానికి వీల్లేదు.

ఆ రోజు రాత్రి కోడిమాంసం వండి, దానిపై సన్నని నిమ్మకాయరసం పిండి అప్యాయంగా వడ్డించి గుడ్డోడు అవురావురుమని తింటుంటే అంది సింగారి!

"ఒరే! నువ్వు నా బిడ్డని చూశ్చేవు. వర్ణించి చెప్పటానికి మాటలు రావు నాకు. దాని అందంలో ఎలక్ట్రీ దీపాన్ని వెలిగించొచ్చు. అయినా ఏం చేస్తాం చెప్పు అంత అందాన్ని? నాలాగే దానికీ పదహారేళ్ళ వయసు రాగానే నువ్వూ, నీ ఎంబడుండే పెద్దోళ్లూ ఓ గుడ్డోడ్నో కుంటోడ్నో కుష్టోడ్నో అల్లుడిగా వెతుకుతారు. అది ఏడ్చినా యేడ్స్తది మనం వినుకోం. గొంతు పిసికి, మెడ విరిచి పెళ్ళి చేస్తాం. అది కాలవొంచ తప్పక మనసు చంపుకుని వాడ్ని కట్టుకుంటుంది ఏముంది? దానికీ రోజూ నరకమే.

"అదే ఇది పుట్టుగుడ్డో, పెంపుడు గుడ్డో అయితే ఏముంటుంది? ఆనందంగా చేసుకుంటుంది. అందుకే యీ పేళ దాని కళ్ళల్లో జెముడుపాలు పోశాను. కళ్ళు పోయాయి.

"ఒరే! యిన్నాళ్లూ నువ్వు నాకు పెనిమిటివి ఇయాల.. ఇయాల నుంచీ నువ్వు మొగుడివి . భర్తవి.. " అంది.

సింగారి గొంతులో వేయి గోదావర్ల రొద పదివేల అగ్నిపర్వతాల లావా! లక్ష తుపాన్ల బీభత్సం.

చేయి కడుక్కొని వచ్చాడు గుడ్డోడు. వాళ్ళద్దరికీ ఆగ్రాత్రి తొలిరాత్రి అయింది. దాన్ని దగ్గరికి తీసుకొని "ఎన్నిటికంటే బతకటం ముఖ్యమే" అన్నాడు వాడు.

కళ్ళుపోయిన పాదిలా చంద్రుడు గుడ్డిగా వెలుగుతున్నాడు ఆకాశంలో.... విధిలేక పెళ్లాడిన దానిలా మినుకు మినుకుమంటూ వెలుగుతోంది అతవి వెంట వెలిగే తార.

